ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

గాదరి సంజీవ (ఫైల్)

పాలకుర్తి రూరల్, మార్చి 17: ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం కోతులాబాద్‌లో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గాదరి సంజీవ (34)కు గ్రామంలో ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో మక్క జొన్న, వరి పంటలు వేయగా నష్టం వచ్చింది. నిన్న మొన్నటి దాకా పోసిన బోరులో నీరు లేకపోవడంతో పంట ఎండిపోయింది. దీనికి తోడు ఇల్లు కట్టుకోవడానికి తెచ్చిన అప్పులు పెరిగిపోయాయి. దీంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తి మనస్తాపం చెందాడు. తన వ్యవసాయ బావి వద్ద శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. దీనిని గమనించిన స్థానికులు సంజీవను వెంటనే జనగామ ఏరియా దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో సంజీవ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఎం సాయిప్రసన్నకుమార్ తెలిపారు.

కడుపు మండి.. పంటకు నిప్పు

- ఎండిన వరి పొలానికి మంటపెట్టిన రైతు
- 15 రోజులు నీళ్లు పెడితే పంట చేతికొచ్చేది
- కాంగ్రెస్ సర్కార్ తీరుపై మండిపడ్డ రైతు సైదులు

మిర్యాలగూడ, మార్చి 17 : లక్షలు వెచ్చించి పంట సాగు చేస్తే.. నీళ్లు లేక చేతి కందాల్సిన పంట ఎండిపోయింది. కాంగ్రెస్ సర్కార్ తీరుకు కడుపు మండిన రైతు ఎండిన పొలానికి మంట పెట్టాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన రైతు మల్లెబోయిన సైదులు ఐదెకరాల్లో వరి సాగు చేశాడు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలో ముల్కలకాల్వ మేజర్ కాల్వ కింద బోరునీటి ఆధారంతో వరిసాగు చేశాడు. పంట పొట్టదశకు వచ్చే వరకు నీరు పారింది. పొట్ట దశలో బోర్లలో నీరు లేకపోవడంతో పొలం పూర్తిగా ఎండిపోవడంతో ఆదివారం ఆయన పంటకు నిప్పు పెట్టాడు. ఇటీవల ఖమ్మం జిల్లాకు నీరు వదిలిన సమయంలో మేజర్ కాల్వలకు నీరు వదిలి ఉంటే పంట చేతికి వచ్చేదని రైతు సైదులు ఆవేదన వ్యక్తం చేశాడు. ఐదెకరాల పొలం సాగుకు రూ.1.25 లక్షల పెట్టుబడి పెట్టినట్టు వాపోయాడు. 15 రోజులపాటు నీరు పారినట్లయితే పంట చేతికి వచ్చేదని, కాంగ్రెస్ ప్రభుత్వం సాగర్ కాల్వకు నీరు వదలకపోవడంతో తీవ్రంగా నష్టపోయినట్టు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో వడగండ్ల వానకు నేల పాలైన వరి పంట

కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం కిష్టాపూర్‌లో దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పోచారం

అకాల వర్షం.. రైతన్న ఆగం

బీభత్సం సృష్టించిన వడగండ్ల వాన

- పలు జిల్లాల్లో పంటలకు తీవ్రనష్టం
- కామారెడ్డిలో 20,071 ఎకరాలు, నిజామాబాద్‌లో 6,058 ఎకరాలు, సిరిసిల్లలో 500 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

నిజామాబాద్/రాజన్న సిరిసిల్ల, మార్చి 17 (నమస్తే తెలంగాణ)/నస్రుల్లాబాద్: అకాల వర్షం రైతన్నను నిండా ముంచింది. ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో శనివారం రాత్రి దాదాపు రెండు గంటలపాటు ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన అన్నదాతను అతలాకుతలం చేసింది. పెద్దమొత్తంలో పంటలకు నష్టం వాటిల్లింది. నిజామాబాద్ జిల్లాలో 3,076 మంది రైతులకు చెందిన 6,058 ఎకరాల్లో పంట నష్టం కలిగినట్టు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. కామారెడ్డి జిల్లాలో 20,071 ఎకరాల్లో నష్టం జరిగినట్టు కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లోని 130 గ్రామాల్లో 14,553 మంది రైతులకు చెందిన పంటలకు నష్టం వాటిల్లినట్టు పేర్కొన్నారు. ప్రధానంగా వరి, మక్కజొన్న, జొన్న పంటలతోపాటు కొత్తిమీర, గోధుమ, ఉల్లి, బొప్పాయి, మామిడి, కూరగాయాల పంటలు దెబ్బతిన్నట్టు పేర్కొన్నారు.

సిరిసిల్లలో 500 ఎకరాలు

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, సిరిసిల్ల పట్టణంలో భారీ వర్షం కురిసింది. రెండు గంటలపాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి భారీగా పంట నష్టం జరిగింది. గంభీరావుపేట మండలంలోనే ఎక్కువ నష్టం జరిగింది. జిల్లా వ్యాప్తంగా వడగడ్ల వాన కారణంగా 500 ఎకరాల వరకు నష్టం జరిగినట్టు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. మరో పదిహేను రోజుల్లో పంటలు చేతికి రానుండగా వడగండ్ల వాన రైతులను దెబ్బతీసింది. కాగా కరీంనగర్ జిల్లాలోని మూడు మండలాల్లో వరి, మక్క, కూరగాయ తోటలు దెబ్బతినగా, మామిడి పిందెలు నేలరాలాయి. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం ఎలుబాక, కిష్టంపేట గ్రామాల్లో వరి, మక్కజొన్న దెబ్బతిన్నది. మానకొండూరు, గన్నేరువరం మండలాల్లో మక్క పంటకు నష్టం వాటిల్లింది.

ప్రభుత్వం ఆదుకోవాలి..

వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం చించోల్లి, కిష్టాపూర్, అన్నారం గ్రామాల పరిధిలో కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను ఆదివారం ఆయన పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను ఓదార్చారు. పంట నష్టంపై కామారెడ్డి, నిజామాబాద్ కలెక్టర్లకు ఫోన్ చేసి వివరించారు. రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం నుంచి సాయం అందించాలని కోరారు.

ఇంటర్ విద్యార్థులు అడ్వాన్స్‌కు అనర్హులా?

- కుల నిర్మూలన వేదిక అధ్యక్షుడు పాపని నాగరాజు

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): జేఈఈ అడ్వాన్స్‌కు 2021-2022 సెప్టెంబర్ 21కి ముందు ఇంటర్ రాసిన వారు అర్హులు కాదని ప్రకటించడం తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు తీరని అన్యాయాన్ని తలపెట్టడమే అవుతుందని కుల నిర్మూలన వేదిక అధ్యక్షుడు పాపని నాగరాజు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏటా జేఈఈ అడ్వాన్స్‌ను ప్రముఖ ఐఐటీ నిర్వహిస్తున్నదని, ఈసారి మద్రాస్ ఐఐటీ నిర్వహిస్తున్నదని గుర్తుచేశారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రకటించకుండా అడ్వాన్స్ రాయడానికి నెల ముందు ఇలా అనర్హులని ప్రకటించడం సరైంది కాదని, అది కుట్రపూరితమని పేర్కొన్నారు. 2019 నుంచి 2022 వరకు దేశంలో కరోనా వ్యాప్తి ఉందని, దీంతో అనేక మంది తెలుగు విద్యార్థులు రాయలేకపోయారని గుర్తుచేశారు. అవేవీ పట్టించుకోకుండా అర్హులు కాదని ప్రకటించడం దారుణమని తెలిపారు. ఎన్ఐటీ, ఐఐటీ, ట్రిపుల్ ఐటీ స్థాయి విద్యాసంస్థల్లోకి తెలుగు రాష్ట్రాలతోపాటు దక్షిణాది రాష్ట్రాల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా, పేద విద్యార్థులు విజయ ఢంకా మోగిస్తున్న తీరును జీర్ణించుకోలేకనే ఇలాంటి నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. తెలుగు, దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అందరికీ న్యాయం చేయాలని పాపని నాగరాజు డిమాండ్ చేశారు.

సముద్రపు దొంగల్ని లొంగదీసిన నేవీ

న్యూఢిల్లీ : భారత నావికా దళం సముద్ర భద్రతలో తన సత్తాను మరోసారి చాటిచెప్పింది. గత ఏడాది డిసెంబర్ 14న సోమాలియా సముద్రపు దొంగలు హైజాక్ చేసిన ఎంవీ రుయెన్ నౌకను వీరోచితంగా పోరాడి కాపాడింది. 35 మంది సముద్రపు దొంగలను లొంగదీసుకుని, 17 మంది సిబ్బందిని రక్షించింది. దొంగల స్వాధీనంలో ఉన్న నౌకను ఐఎన్ఎస్ కోల్‌కతా నౌక ఈ నెల 15న అడ్డుకోగలిగింది. దీనికి ఐఎన్ఎస్ సుభద్ర, హెచ్ఏఎల్ఈ ఆర్‌పీఏ, పీ8ఐ మారిటైమ్ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్, సీ-17 యుద్ధ విమానం నుంచి దిగిన మార్కోస్-ప్రహర్స్ సహకరించారు. ఎవరూ గాయపడకుండా ఈ లక్ష్యాన్ని సాధించారు.

బడికి అత్యవసర నిధి 25 వేలు

- జూన్ 10లోపు స్కూళ్లకు మరమ్మతులు
- మహిళా సంఘాలు, ఎంపీడీవోలకు అధికారం

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని సర్కారు బడుల్లో చిన్న చిన్న మరమ్మతులు చేపట్టేందుకు వీలుగా విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకున్నది. ఇందుకోసం పాఠశాలలకు ఎమర్జెన్సీ అండ్ మెయింటెనెన్స్ ఫండ్‌ను అందుబాటులో ఉంచనున్నది. ఒక్కో స్కూల్‌కు రూ.25 వేలను కేటాయించనున్నది. ఎలాంటి టెండర్లు లేకుండా ఈ నిధులను స్కూళ్లు వాడుకోవచ్చు. ఈ నిధులతో పాఠశాలలకు అవసరమైన స్విచ్‌లు, వైర్లు, ట్యూబ్‌లైట్లు, బల్బులు, ఫ్యాన్లు, నీటి సరఫరా ఏర్పాట్లు, నల్లాల బిగింపు, మూత్రశాలలు, తలుపులు, కిటికీల రిపేర్లను చేసుకోవచ్చు. ఈ పనులన్నింటినీ నూతనంగా ఏర్పాటుచేస్తున్న 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ'లు చేపడతాయి. కలెక్టర్ వద్ద అందుబాటులో ఉన్న జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్టు (సింగరేణి), స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌తోపాటు గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను ఇందుకు కేటాయిస్తారు. జూన్ 10లోపు అంటే స్కూళ్లు పునఃప్రారంభమయ్యేలోపు మరమ్మతులను పూర్తి చేయాలని గడువుగా నిర్ణయించారు. రూ.లక్ష వరకు పనుల చెల్లింపులు ఎంపీడీవోలు చేస్తారు. అంతకు మించితే జిల్లా కలెక్టర్ల ద్వారా బిల్లులు పొందాల్సి ఉంటుంది.

ఇంజినీర్ల పాత్ర నామమాత్రం

ఇదివరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)లు ఉండగా, వీటి స్థానంలో ఇప్పుడు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటుచేశారు. పాఠశాల విద్యలోని అన్ని పనులు ఇక నుంచి గ్రామ, మండల, జిల్లా మహిళా సమాఖ్యలు చేపట్టడమే కాకుండా ఇవే పర్యవేక్షణ చేస్తాయి. దీంతో సివిల్ వర్క్స్, ఇంజినీరింగ్ పనుల్లో ఇంజినీర్ల పాత్ర నామమాత్రం కానున్నది. కేవలం టెక్నికల్ అనుమతులివ్వడం వరకే ఇంజినీర్ల పాత్రను పరిమితం చేశారు.

18 మంది హిందూ శరణార్థులకు భారత పౌరసత్వం

అహ్మదాబాద్: పాకిస్థాన్ నుంచి వచ్చిన 18 మంది హిందూ శరణార్థులకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ప్రభుత్వ అధికారులు భారత పౌరసత్వం జారీ చేశారు. శనివారం ఇక్కడ నిర్వహించిన ఓ కార్యక్రమంలో గుజరాత్ మంత్రి హర్ష సంఘ్వీ శరణార్థులకు భారత పౌరసత్వం పత్రాల్ని అందజేశారు. పాకిస్థాన్, అఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్‌కు చెందిన మైనార్టీల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గెజిట్ నోటిఫికేషన్స్ జారీ చేశాయి. అహ్మదాబాద్ జిల్లాలో ఇప్పటివరకు పాక్‌కు చెందిన మొత్తం 1,167మంది హిందూ శరణార్థులకు భారత పౌరసత్వం దక్కింది.

అనుచరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నేడు బీఆర్ఎస్‌లోకి పవీణ్‌కుమార్

మొదటిపేజీ తరువాయి...

ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొనే బీఆర్ఎస్‌లో చేరుతున్నానని తేల్చిచెప్పారు.

నిండు మనసుతో ఆశీర్వదించండి..

'నేను నా రాజకీయ భవితవ్యంపై ఈ రోజు హైదరాబాద్‌లో వందలాది శ్రేయోభిలాషులు, ఆప్తులు, అభిమానులందరితో మేధోమథనం జరిపాను. ఆ సభలో రకరకాల అభిప్రాయాలు వచ్చాయి. కానీ, నా మీద నమ్మకంతో నేను ఏ నిర్ణయం తీసుకున్నా నా వెంటనే నడుస్తామని మాట ఇచ్చిన అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. తెలంగాణ ప్రజల విశాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, దేశంలో లౌకికత్వాన్ని కాపాడటం కోసం, రాజ్యాంగ రక్షణ కోసం, బహుజనుల అభ్యున్నతి కోసం నేను రేపు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ సమక్షంలో భారత రాష్ట్ర సమితిలో చేరుతున్నాను. నేను ఎక్కడున్నా బహుజన మహనీయుల సిద్ధాంతాన్ని గుండెల్లో పదిలంగా దాచుకుంటూ.. వారి కలలను నిజం చేసే దిశగా పయనిస్తా. దయచేసి నిండు మనసుతో ఆశీర్వదించండి.. జై భీం జై తెలంగాణ... జై భారత్ ' అంటూ నినదించారు.

తెలంగాణ ప్రయోజనాల పట్ల కమిట్‌మెంట్

బీఆర్ఎస్ పార్టీ నుంచి సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్, బీజేపీల్లో చేరుతుండగా సుదీర్ఘకాలం పోలీసు ఉన్నతాధికారిగా పనిచేసి (ఐపీఎస్) తన పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరుతుండటం ఆసక్తిగా నెలకొన్నది. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేసి తాను రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో చేరినా, బీజేపీలో చేరాలనుకున్నా ఆ పార్టీలు ఆహ్వానిస్తాయి. ఆయనను ఆకాశానికి ఎత్తి కండ్లకు అద్దుకొని ఎక్కడ పోటీచేస్తానన్నా సీటు కేటాయిస్తాయి. అలాంటిది ఆర్ఎస్పీ బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకోవటం, తన చేరిక నేపథ్యాన్ని వెల్లడించటం అంటే ఆయనకు తెలంగాణ ప్రజల విశాల ప్రయోజనాల పట్ల ఆయనకు ఉన్న కమిట్‌మెంట్‌కు నిదర్శమని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

నియామకాలు నిలిచేనా?

మొదటిపేజీ తరువాయి...

అభ్యర్థులను గురుకులాలు అందజేసిన ఇండెంట్ల ప్రకారం ఆయా సొసైటీలకు అలాట్ చేసింది. డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ, పీడీ, లైబ్రేరియన్ క్యాటగిరీల్లో ఎంపికైన అభ్యర్థులను సొసైటీలకు కేటాయిస్తూ అలాట్‌మెంట్ ఆర్డర్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా గత నెల 15న, ఈ నెల 4న రెండు దఫాలుగా ఎల్బీ స్టేడియం వేదికగా అందజేసింది. అలాట్‌మెంట్ ఆర్డర్లు అందుకున్న అభ్యర్థులు తమకు కేటాయించిన సొసైటీల్లో రిపోర్టు చేయాల్సి ఉన్నది. సదరు అభ్యర్థులకు ఆయా సొసైటీలు మరోసారి కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్స్ ఇవ్వాల్సి ఉన్నది. అయితే ఎన్నికల కోడ్ రావడంతో పోస్టింగ్‌లు ఇస్తారా? ఇవ్వరా? అన్న అంశంపై సందిగ్ధత నెలకొన్నది. ఒకవేళ 60 రోజుల్లోగా పోస్టింగ్ ఆర్డర్స్ ఇవ్వకుంటే అలాట్‌మెంట్ ఆర్డర్స్ రద్దవుతాయనే ప్రచారం అభ్యర్థులను ఆందోళనకు గురిచేస్తున్నది. ఇప్పటికే అలాట్‌మెంట్ ఆర్డర్స్ ఇచ్చి నెల దాటిందని, మరో నెల గడువు మాత్రమే ఉన్నదని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఎన్నికల కోడ్ దాదాపు 80 రోజులపాటు అమలులో ఉంటుంది. అయితే, అలాట్‌మెంట్ ఆర్డర్ 60 రోజుల్లో రద్దు కాదని, ఆ నిబంధన పోస్టింగ్ ఆర్డర్ ఇచ్చినప్పటి నుంచి మాత్రమే వర్తిస్తుందని పలువురు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీనిపై ట్రిబ్ స్పష్టతనివ్వకపోవడంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొన్నది.

గురుకులాల్లో ప్రమోషన్ల సమస్య

అలాట్‌మెంట్స్ ఆర్డర్స్ అందుకున్న అభ్యర్థులకు పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చేందుకు మరో సమస్య ఎదురవుతున్నట్టు సమాచారం. ఇప్పటికే గురుకులాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రమోషన్ల అంశం అందుకు అడ్డంకిగా మారింది. బీసీ గురుకులాల్లోని సిబ్బందికి ఇటీవలనే ప్రమోషన్లు కల్పించినప్పటికీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాల సిబ్బందికి 2018 నుంచి ప్రమోషన్లు లేవు. వీరికి కూడా ప్రమోషన్స్ ఇవ్వాలని నిర్ణయించినప్పటికీ ఇంకా డీపీసీ ఆమోదం లభించలేదు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రమోషన్ల అంశాన్ని పక్కన పెట్టాల్సిన పరిస్థితి. తమకు ప్రమోషన్లు ఇవ్వకుండా నూతన అభ్యర్థులకు పోస్టింగ్ ఇవ్వొద్దని గురుకుల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఆయా గురుకులాలకు అలాట్ అయిన అభ్యర్థులకు ఇప్పుడు పోస్టింగ్ ఇచ్చేందుకు ఇదొక సమస్యగా మారింది. ప్రస్తుతం అడ్‌హాక్ పద్ధతిలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించి, ఆపై నూతనంగా అలాటైన అభ్యర్థులకు అదే అడ్‌హాక్ పద్ధతిలో పోస్టింగ్‌లు ఇచ్చే అవకాశం ఉన్నదని నిపుణులు చెప్తున్నారు. అందుకు మెమో జారీ చేస్తే సరిపోతుందని సూచిస్తున్నారు. ఆయా అంశాలపై ఇప్పటివరకు గురుకులాల నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో ఇటు అభ్యర్థులు, అటు ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు.

అలాట్‌మెంట్ పొందనివారిది మరో సమస్య

మహబూబ్‌నగర్-రంగారెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆయా జిల్లాల పరిధిలోని అభ్యర్థులకు అలాట్‌మెంట్ ఆర్డర్స్ ఇవ్వలేదు. దివ్యాంగుల కోటా అభ్యర్థుల జాబితా సైతం పెండింగ్‌లో ఉన్నది. మిగతా జిల్లాల్లో తమతోపాటు ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు ఇప్పటికే అలాట్‌మెంట్ ఆర్డర్స్ పొందారని, వారికి పోస్టింగ్ ఆర్డర్స్ కూడా ఇస్తే తాము సర్వీస్‌లో జూనియర్లుగా మారిపోతామని మహబూబ్‌నగర్-రంగారెడ్డి పరిధిలోని అభ్యర్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. భవిష్యత్తులో ఇది ప్రమోషన్లపై కూడా ఇది ప్రభావం చూపుతుందని, దీనిపై ట్రిబ్ అధికారులు స్పందించి, స్పష్టతనివ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎన్నికలు రెఫరండమే

- పార్లమెంట్ ఎన్నికల్లో ఫలితాలకు బాధ్యత వహిస్తాం
- వంద రోజుల్లో హామీలు నెరవేర్చాం
- సీఎంగా చూశారు.. ఇక నుంచి పీసీసీ చీఫ్‌గా చూస్తారు
- మేం గేట్లు తెరిస్తే ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్యే వచ్చి చేరారు
- మా ప్రభుత్వాన్ని కూల్చుతామంటే ఊరుకుంటామా?
- వంద రోజుల పాలనపై 'మీట్ ది మీడియా'లో సీఎం



'మీట్ ది మీడియా' కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనకు ముమ్మాటికీ రెఫరండమేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. మ్యానిఫెస్టోలో తాము ఇచ్చిన హామీలను వంద రోజుల్లో నెరవేర్చామని వెల్లడించారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ వంద రోజుల పాలనపై సీఎం రేవంత్‌రెడ్డితో 'మీట్ ది మీడియా' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రజాభీష్టం మేరకు పాలన సాగిస్తున్నామని తెలిపారు. రైతుభరోసా అందరికీ ఇవ్వబోమని స్పష్టం చేశారు. కొండలు, గుట్టలు ఫామ్‌హౌస్‌లకు ఇచ్చేది లేదని ముందే చెప్పామని వెల్లడించారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కేంద్రం తో, గవర్నర్‌తో సామరస్యంగా ముందుకెళ్తున్నామని అన్నారు.

గంజాయి మొక్కలను పీకిపారేస్తాం

బీఆర్ఎస్ ప్రభుత్వం కొన్ని గంజాయి మొక్కలను నాటి వెళ్లిందని, ఆ మొక్కలను ఒక్కొక్కటిగా పీకిపారేస్తున్నామని రేవంత్ చెప్పారు. జీరో బిల్లుతో పేదలకు ఉచిత విద్యుత్తు అందిస్తుంటే, కొంతమంది అడ్డు తగులుతున్నారని, వాళ్ల అడ్డు తొలగించైనా పేదలకు ఉచిత విద్యుత్తు అందిస్తామని స్పష్టంచేశారు. ముందుగా డబ్బులు చెల్లించాకే జీరో విద్యుత్తు బిల్లులు ఇవ్వాలని విద్యుత్తు రెగ్యులేటరీ కమిషన్ నోటీసులు ఇచ్చిందని మండిపడ్డారు. ఇలాంటి తెలివితేటలు ప్రదర్శించిన రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ ఎక్కువ రోజులు ఆ కుర్చీలో ఉండరని హెచ్చరించారు. బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్‌కు చిత్తశుద్ధి ఉంటే ఫోన్ ట్యాపింగ్‌లపై కేంద్రంతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీఎస్పీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు టీఎస్‌పీఎస్సీ చైర్మన్ పదవి ఆఫర్ చేస్తే తీసుకోలేదని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

గేట్లు తెరిచాం.. ఇక ఆగదు

'వంద రోజుల పాటు సీఎంగా పూర్తి దృష్టి కేంద్రీకరించా.. ఇప్పటి నుంచి పీసీసీ అధ్యక్షుడిగా నా రాజకీయం ఏమిటో చూపిస్తా. ఈ రోజు ఉదయమే గేట్లు తెరిస్తే అప్పుడే ఒక ఎమ్మెల్యే, ఒక ఎంపీ మా పార్టీలో చేరారు. ఇక మా గేట్లు తెరిచే ఉంటాయి. మా ప్రభుత్వాన్ని కూల్చుతామంటే చూస్తూ ఊరుకుంటామా?' అని రేవంత్ వ్యాఖ్యానించారు.గత ప్రభుత్వం కొందరు అధికారులతో కలిసి రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. వాటిపై నివేదికలు అందాక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు కే విరాహత్‌అలీ, సీఎం సీపీఆర్వో అయోధ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ విమానానికి తప్పిన ప్రమాదం

శంషాబాద్ రూరల్, మార్చి 17: సీఎం రేవంత్‌రెడ్డితోపాటు పలువురు ప్రముఖులు వెళ్లాల్సిన ఇండిగో (6ఈ 5099) విమానానికి పెనుప్రమాదం తప్పింది. ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ముంబైకి ప్రయాణికులతో వెళ్తున్న విమానం రన్‌వై పైకి చేరగానే ఇంజన్‌లో సాంకేతికలోపం తలెత్తింది. వెంటనే గుర్తించిన పైలెట్ విమానాన్ని తిరిగి ల్యాండింగ్ చేశాడు. విమానంలో ఏర్పడిన సాంకేతిక సమస్యను పరిష్కరించిన తర్వాత సాయంత్రం నాలుగు గంటలకు తిరిగి ముంబైకి వెళ్లినట్టు ఎయిర్‌లైన్స్ ప్రతినిధులు తెలిపారు. ఆ విమానంలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతోపాటు పలువురు ప్రముఖులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో రంజిత్‌రెడ్డి, దానం చేరిక

- చేవెళ్ల, సికింద్రాబాద్ లోక్‌సభ సీట్ల కేటాయింపు?

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదివారం కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో వీరిద్దరూ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వీరి చేరికతో కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థులు మారనున్నట్టు కాంగ్రెస్ వర్గాల సమాచారం. చేవెళ్ల నుంచి ఎంపీ టికెట్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డికి, సికింద్రాబాద్ టికెట్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కు ఇస్తారని ప్రచారం జరిగింది. తాజా పరిణామాల వల్ల చేవెళ్ల టికెట్‌ను రంజిత్‌రెడ్డికి, సికింద్రాబాద్ స్థానం దానం నాగేందర్‌కు ఇవ్వనున్నారని కాంగ్రెస్ వర్గాల సమాచారం. సునీతా మహేందర్‌రెడ్డిని మల్కాజిగిరి నుంచి బరిలోకి దింపాలని నిర్ణయించినట్టు సమాచారం. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర ముగింపు సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో కలిసి ఆదివారం సాయంత్రం ముంబైకి వెళ్లారు.

ఎంపీ ఎన్నికల తర్వాత డబుల్ ఇంజిన్ సర్కార్

- బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

హైదరాబాద్, మార్చి17 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల తరువాత రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తుందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రశ్నిస్తున్న తెలంగాణ పేరిట రూపొందించిన పోస్టర్లను ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సంద